క్లుప్తంగా

'పెన్షనర్స్ డే' ను విజయవంతం చేయండి

కోస్గి: స్థానిక బసవేశ్వర శివాలయ మందిరం ధర్మశాలలో నేడు ఆదివారం జాతీయ పెన్షనర్ల దినాన్ని పురస్కరించుకొని ఏర్పాటు చేస్తున్న 'పెన్షనర్స్ డే' ను విజయవంతం చేయాలని ఆ సంఘం మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రఘునాథ్‌రెడ్డి, మల్లికార్జున్ ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కోస్గి సివిల్ జడ్జితోపాటు సీఐ హాజరవుతున్నారన్నారు. ఇందులో భాగంగా సీనియర్ పెన్షనర్లను సన్మానించడంతోపాటు బ్యాంకు అధికారులు, ఎస్టీఓలతో పెన్షనర్ల సందేహాలకు సమాధానాలతోపాటు పలు కార్యక్రమాలు ఉంటాయని, అధిక సంఖ్యలో పెన్షనర్లు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

రైతు బజార్‌కు తీర్మానం



మరికల్: మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ఎదుట ఉన్న ప్రభుత్వ స్థలంలో రైతుబజార్ నిర్మాణానికి శనివారం నిర్వహించిన గ్రామ సభలో సభ్యులు తీర్మానం చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు పంచాయతీ ఆవరణలో నిర్వహించిన గ్రామసభలో రైతులు పండించిన కూరగాయలను విక్రయించేందుకు బస్టాండ్ ఎదుట స్థలంల్లో రైతుబజార్, అలాగే పలు అభివృద్ధి పనులకు సర్పంచ్ గోవర్ధన్ సమక్షంలో తీర్మానం చేసి కలెక్టర్‌కు పంపించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, ఇతర పార్టీల నాయకులు పాల్గొన్నారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు



ధన్వాడ: మండలంలోని గోటూర్‌లో ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. రాజమూర్ జాతర ఉత్సవాల్లో భాగంగా స్వామివారివారికి వారం రోజులపాటు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. కార్యక్రమంలో సర్పంచ్ నారాయణరెడ్డి, ఉపసర్పంచ్ వెంకట్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, బాల్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

సైనికుల త్యాగాలను స్మరించుకోవాలి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: దేశం కోసం త్యాగాలు చేసిన సైనికులను స్మరించుకోవాలని ఎన్టీఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్ పేర్కొన్నారు. ఈమేరకు ఎన్‌సీసీ ఆధ్వర్యంలో సైనిక్ దివాస్ నిర్వహించారు. ఎన్‌సీసీ అధికారులు రాజేశ్వరీ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందజేత



అమరచింత: విద్యార్థులు క్రమశిక్షణతో ఉంటూ చదువులపై దృష్టి సారిస్తే ఉన్నత లక్ష్యాలను సాధిస్తారని మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ అన్నారు. జెడ్పీఉన్నత పాఠశాలలో శనివారం గుడిహల్ రంగాచార్యుల జ్ఞాపకార్థం ఆయన కుమారుడు వెంకటనాథం విద్యార్థులకు స్కాలర్ షిప్‌లను అందించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న మున్సిపల్ చైర్‌పర్సన్ మాట్లాడుతూ మంచి మార్కులు సాధించడమే కాకుండా క్రమశిక్షణ, హాజరు విధానంలో ముందున్న 9మంది విద్యార్థులను గుర్తించి వారికి రూ.1.04లక్షలు ప్రోత్సాహకంగా అందించడం సంతోషకరమన్నారు. పాఠశాలకు సీసీ కెమెరాల కోసం రూ.50వేల అందించారని తెలిపారు. ఈ మేరకు వెంకటనాథంను శాలువా, పూలమాలతో సత్కరించారు. కార్యక్రమంలో సౌజన్యరెడ్డి, నాగభూషణంగౌడ్, బలరాముడు పాల్గొన్నారు.

క్రమబద్ధీకరణ చర్యలు చేపట్టాలి

స్టేషన్ మహబూబ్‌నగర్: దివ్యాంగ విద్యార్థులకు సేవలందిస్తూ కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్న ప్రత్యేక ఉపాధ్యాయులను క్రమబద్ధీకరించేలా చర్యలు చేపట్టాలని.. విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని శనివారం జిల్లా కేంద్రంలో టీపీసీసీ అధికార ప్రతినిధి హర్షవర్ధన్‌రెడ్డికి ఐఈఆర్‌పీలు వినతిపత్రం అందజేశారు. రాష్ట్రంలో మంజూరైన 1523 ప్రత్యేక ఉపాధ్యాయ పోస్టుల్లో ఇప్పటికీ పనిచేస్తున్న వారిని క్రమబద్ధీకరించి, మిగిలిన వాటిని నోటిఫికేషన్ ద్వారా భర్తీ చేయాలని కోరారు. అంతకుముందు హర్షవర్ధన్‌రెడ్డిని సన్మానించారు. ఐఈఆర్‌పీలు శ్రీనివాసులు, అర్చన, రఘుబాబు, మైబన్న, పావని, గీత, సంగీత, రాఘవేందర్, విజయలక్ష్మి పాల్గొన్నారు.

అందుబాటులో మొక్కలు

- అదనంగా 32 వేలు..
- పనులు ముమ్మరం చేసిన అధికారులు



కోల్పూర్ నర్సరీలో పనులను పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)



వర్కూర్ సమీపంలో బ్యాగులో మట్టి నింపుతున్న కూలీలు (ఫైల్)

మాగనూర్: ర్సరీల్లో మొక్కలపెంపు సామర్థ్యం పెంచి.. హరితహారం కార్యక్రమంలో మొక్కల కొరత లేకుండా.. ఇతర గ్రామాల నుంచి మొక్కలు తీసుకొచ్చే అవసరం లేకుండా అధికారులు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా ప్రతి గ్రామంలోని నర్సరీలో మొక్కలను పెంచుతున్నారు. ఒక సంవత్సరానికి సరిపడా అవసరం ఉన్న మొక్కలు పెంచుతున్నారు.

అదనంగా 32 వేలు..

గతంలో మండలంలోని గ్రామానికో నర్సరీ చేపట్టారు. నర్సరీలో 40వేల నుంచి 70వేల వివిధ మొక్కలు పెంచారు. అయితే నర్సరీల్లో అవసరం ఉన్న మొక్కలు లేకపోవడంతో మొక్కల కొరత ఏర్పడింది. దీంతో ఇతర గ్రామాలకు వెళ్లి ఆయా నర్సరీల్లో అవసరం ఉన్న మొక్కలను ట్రాక్టర్లలో తెచ్చి నాటుకోవాల్సిన పరిస్థితులు ఏర్పాడ్డాయి. దీనిని దృష్టిలో పెట్టుకొని ప్రస్తుతం అవసరం ఉన్న మొక్కలు అందుబాటులోనే లభ్యం అయ్యేలా గ్రామాల్లో నర్సరీల్లో మొక్కలు పెంచుతున్నారు. మండల వ్యాప్తంగా గతం కంటే అదనంగా నర్సరీలో మరో 32 వేల మొక్కలను పెంచనున్నారు.

మొదలైన పనులు

నర్సరీల్లో ఇప్పటికే మొక్కల పెంపకం చేపట్టారు. ఇందులో భాగంగా మట్టి సేకరణ, బ్యాగులో మట్టిని నింపడం, విత్తనాల సేకరణ, ప్రైమరీ బెడ్ల ద్వారా మొక్కలు పెంచడం వంటి పనులు చేపట్టారు. ఇప్పటికే నీటి వసతిని గుర్తించి ప్రతిరోజు పనులు జరిగేలా చర్యలు తీసుకున్నారు. ఈ నర్సరీలో ఒక సంవత్సరానికి సరిపడా అవసరమైన మొక్కలు పెంచనున్నారు.

సెంటర్ నర్సరీలు ఒకటి..

అయితే ఈ సంవత్సరం మండలంలో కొత్తగా మూడు సెంటర్ నర్సరీల పెంపకం ద్వారా మొత్తంగా 1.92 లక్షల మొక్కల పెంపకం లక్ష్యంగా పెట్టుకున్నట్లు అధికారులు తెలుపుతున్నారు. ఇందులో మందిపల్లి 30వేల మొక్కలు, గురువలింగంపల్లి నర్సరీలో 15వేల మొక్కలు, వడ్వాట్‌లో 12వేలు, బైరంపల్లి 15వేలు, ఉజ్జెల్లిలో 15వేల మొక్కల చొప్పున పెంచుతుండగా, నేరడగం 10వేల మొక్కలు, ఒబ్లాపూర్ 10వేల మొక్కలు పెంచనున్నారు. 10గ్రామాలల్లో 10 వేల చొప్పున మొక్కలు గ్రామ నర్సరీలో వేలు మొక్కల చొప్పున పెంచనున్నారు.

ముమ్మరంగా పనులు..



మండల వ్యాప్తంగా నర్సరీలలో మొక్కల పెంపకం పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ప్రస్తుతం ఆయా గ్రామాల్లో అవసరం మేరకు మొక్కలు పెంచుతున్నాం. ఈ సంవత్సరం మొత్తంగా 1.92 లక్షల మొక్కల పెంపకం లక్ష్యంగా పెట్టుకున్నాం. హరిత మండలంగా మారుస్తాం.

– సత్యప్రకాష్, ఏపీఓ మాగనూర్

పండ్లు, పూల మొక్కలు..



గ్రామాల్లో ఎక్కువగా పండ్లు, పూలజాతి మొక్కలు అడిగారు. అవి నర్సరీల్లో అందుబాటులో లేకపోవడంతో ఇబ్బందులు పడ్డాం. ఇప్పుడు నర్సరీల్లో అవసరం ఉన్న మొక్కలు పెంచనున్నాం. అన్ని మొక్కలు ఇక గ్రామంలోని నర్సరీలోనే దొరుకనున్నాయి. రెండు మీటర్ల ఎత్తు మొక్కలు పెంచనున్నాం. భవిష్యత్‌లో పంచాయతీలు వేరే గ్రామంలో మొక్కలను కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఉండవు.

– శశికళ, ఎంపీడీవో మాగనూర్

వైభవంగా అయ్యప్ప పడిపూజ



మరికల్‌లో కలశ ఊరేగింపుగా వెళ్తున్న అయ్యప్ప భక్తులు

కోస్గి: పట్టణంలోని శ్రీ లక్ష్మీవెంకటేశ్వర శివసాయి అయ్యప్ప ఆలయాల్లోని శనివారం స్వామివారి పడిపూజతో ఆలయ ప్రాంగాణం నామస్మరణతో మార్మోగింది. ఈ సందర్భంగా అయ్యప్పమాలధారణ స్వాములు మహాపడి పూజను వేడుకగా నిర్వహించారు. ఇందులో భాగంగా 18మెట్లను ప్రత్యేకంగా అలంకరించి ఉదయం 5:30కు స్వామివారి సుప్రభాత సేవ, 6గంటలకు విశేష పంచామృతాభిషేకం, మహామంగళ హారతి నిర్వహించారు. మహాపడిపూజ సందర్భంగా భక్తిపాటలతో పూజలు చేశారు. అనంతరం అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలోని ఆయా గ్రామాల అయ్యప్ప స్వాములు, భక్తులు పాల్గొన్నారు.

మరికల్: మండలంలోని శనివారం శివాలయం ఆవరణలో నిర్వహించిన అయ్యప్పపడిపూజ వైభవంగా నిర్వహించారు. అంతకుముందు మాలధారణ దరించిన స్వాములు కలశం ఊరేగింపు నిర్వహించారు. అనంతరం గురుస్వాములు అయ్యప్ప, లక్ష్మయ్య, శ్రీనివాస్, సతీష్ స్వాములు మహాపడిపూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు.



కోస్గిలో ప్రత్యేక పూజలు చేస్తున్న స్వాములు

జాతీయ బీసీ వెల్ఫేర్ కార్యదర్శిగా అరవింద్



మక్తల్: జాతీయ బీసీ వెల్ఫేర్ కార్యదర్శిగా మక్తల్ మండలం గుడిగండ్ల గ్రామానికి చెందిన అరవింద్‌ను రాజ్యసభ ఎంపీ జాతీయ బీసీ వెల్ఫేర్ అసోసియేషన్ కృష్ణయ్య నియామకపు పత్రాన్ని అరవింద్‌కు అందజేశారు. అరవింద్‌ను ఎంపిక చేయడంతో పలువురు బీసీ నేతలు అభినందించారు.

నేడు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం ప్రారంభం

మక్తల్: పట్టణంలోని నూతన ఎమ్మెల్యే కార్యాలయంలో ఆదివారం ఎమ్మెల్యే వాకిటి శ్రీ హరి పూజ కార్యక్రమం నిర్వహించనున్నట్లు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గణేష్‌కుమార్ తెలిపారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో పూజలుచేసి అడుగుపెడుతున్నట్లు కాంగ్రెస్ నాయకులు తెలిపారు.

బెల్టు షాపులు పూర్తిగా నిర్మూలించాలి

మహబూబ్‌నగర్ రూరల్: కాంగ్రెస్ ప్రభుత్వం బెల్టు షాపులను పూర్తిగా నిర్మూలించాలని ఆదేశాలు జారీ చేయడాన్ని స్వాగతిస్తున్నామని మాల మహానాడు రాష్ట్ర అధికార ప్రతినిధి బ్యాగరి వెంకటస్వామి అన్నారు. శనివారం ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌కు నాయకులు వినతిపత్రం అందజేశారు. జిల్లా అధ్యక్షుడు చిన్న, ప్రధాన కార్యదర్శి అరేందర్, కోశాధికారి ఆంజనేయులు, అధికార ప్రతినిధి రవికుమార్, యువజన విభాగం అధ్యక్షుడు మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామపంచాయతీ భవనాలను పూర్తిచేయాలి

కోయిల్‌కొండ: మండలంలోని పెండింగ్‌లో ఉన్న గ్రామపంచాయతీ భవనాల నిర్మాణ పనులను వెంటనే పూర్తి చేయాలని ఎంపీడీఓ జయరాములు అన్నారు. శనివారం మండలంలోని అనంతపూర్‌లో నిర్మాణంలో ఉన్న గ్రామపంచాయతీ భవనాన్ని ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ అసంపూర్తిగా ఉన్న పనులను కాంట్రాక్టర్లు వెంటనే పూర్తిచేయాలన్నారు. ఏపీఓ నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.



పనులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ జయరాములు

విద్యార్థుల ప్రగతిని వివరించాలి

నర్వ: విద్యార్థులు పాఠశాలలో నేర్చుకున్న అంశాలను ఇంటి వద్ద సాధన చేసేలా తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలని పీహెచ్ హెచ్‌ఎం మల్లేష్ అన్నారు. శనివారం పాఠశాల ఆవరణలో తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. తొలిమెట్టులో భాగంగా నిర్వహిస్తున్న బోధనాభ్యాసనలో విద్యార్థుల ప్రగతిని తల్లిదండ్రులకు వివరించారు. విద్యార్థుల కోసం ప్రభుత్వం ఉచితంగా అందించిన వర్క్‌షీట్‌లను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో యాజమాన్య కమిటీ చైర్మన్ అయ్యన్న, వైస్ చైర్మన్ రాధ, ఉపాధ్యాయులు రాజేష్, హరిశంకర్, తల్లిదండ్రులు శిష్టువర్ధన్, ఖాజాపటేల్, నర్సింహులు, వెంకటన్న, నజీర్ తదితరులు పాల్గొన్నారు.

కృష్ణా: మండలంలోని కున్సి ఉన్నత పాఠశాలలోని పదోతరగతి విద్యార్థులకు శనివారం ముడుమాల్ జీహెచ్‌ఎం నిజాముద్దీన్ పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు పరీక్షల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కాంప్లెక్స్ హెచ్‌ఎం శంకర్, పాఠశాల హెచ్‌ఎం మహేష్, ఉపాధ్యాయులు నారాయణ, శ్రీశైలం, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఊట్కూరు: విద్యార్థుల హాజరుశాతాన్ని పెంచుదామని హెచ్‌ఎం లక్ష్మారెడ్డి అన్నారు. శనివారం మండలంలోని నిడుగుర్తి ప్రాథమికోన్నత పాఠశాలలో తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో విద్యార్థుల ప్రగతి, విద్యార్థుల హాజరుశాతం, పాఠశాలలో మౌలిక వసతులు తదితర అంశాలపై చర్చించారు. అలాగే మండలంలోని బాలికల ఉన్నత పాఠశాలలో పీఎం శ్రీ పథకంలో భాగంగా తరగతి గదుల్లో ఏర్పాటుచేసిన మూడు డిజిటల్ బోర్డ్‌లను సర్పంచ్ సూర్యప్రకాశ్ రెడ్డి ప్రారంభించి మాట్లాడారు.. విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు రావాలని కష్టపడి చదవాలన్నారు. ఆయా కార్యక్రమాల్లో హెచ్‌ఎం ప్రేమకుమారీ, మాజీ ఎంపీటీసీ గోవిందప్ప, నిర్వాహకులు రాజశేఖర్, ఉపాధ్యాయులు స్పందన, రత్నమ్మ, ఉపాధ్యాయులు పద్మ, సునిత, వెంకటప్ప తదితరులు పాల్గొన్నారు.

మాగనూర్: సర్కారు బడుల్లో తమ పిల్లలను చేర్పించి, ప్రభుత్వం అందించే ఉచిత సదుపాయాలతో ఆర్థికభారం తగ్గించుకోవాలని ఓబ్లాపూర్ పాఠశాల హెచ్‌ఎం తిరుపతి అన్నారు. బడి బయట ఉన్న పిల్లల వివరాలు తెలుసుకొని, వారిని బడిలో చేర్పించాలని తల్లిదండ్రులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సీఆర్పీ కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

ధన్వాడ: బడి మధ్యలో మానేసిన పిల్లలను తిరిగి పాఠశాలల్లో చేర్పించాలని హెచ్‌ఎం భారతి అన్నారు. శనివారం మండలంలోని కొండాపూర్ గ్రామ పరిధిలోని తండాలలో బడిబయట పిల్లల సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా వారి ఇంటింటికి వెళ్లి వివరాలను సేకరించారు. చదువు ప్రాముఖ్యతను వివరిస్తు విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీఆర్‌పీ వెంకట్రాములు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



నర్వలో సమావేశంలో మాట్లాడుతున్న హెచ్‌ఎం



ధన్వాడలో..



కృష్ణాలో మాట్లాడుతున్న జీహెచ్‌ఎం

సైబర్ నేరాలపై అవగాహన

ఊట్కూరు: విద్యార్థులు సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని పోలీస్ కళాబృందం సభ్యులు సురేందర్‌గౌడ్ కోరారు. శనివారం మండలంలోని చిన్నపొర్ల ఉన్నత పాఠశాలలో ఎస్పీ ఆదేశాల మేరకు కళాబృందం వారిచేత సామాజిక రుగ్మతలపై అవగాహన కల్పించారు. ఆట, పాటలచేత బాలకార్మిక వ్యవస్థ, సైబర్ నేరాలు, సెల్‌ఫోన్ వినియోగం, మహిళలపై అఘాయిత్యాలు, రోడ్డు భద్రత నియమాలు, పౌరహక్కులు, తదితర విషయాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు చిన్నతనం నుంచి క్రమశిక్షణ, పట్టుదలతో చదవడంతో జ్ఞానం పెరుగుతుందన్నారు. తల్లిదండ్రులు, పెద్దలను గౌరవించి సత్ప్రవర్తన కలిగి ఉండాలని తెలిపారు. సైబర్ నేరాలకు గురైతే వెంటనే టోల్ ఫ్రీ నెంబర్ 100, 1930లకు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో కళాబృందం సభ్యులు శేఖర్, లింగన్న, రూక్యా నాయక్, కల్యాణి, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.



చిన్నపొర్ల పాఠశాలలో అవగాహన కల్పిస్తున్న పోలీస్ కళాబృందం

ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలి

మాగనూర్: ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని ఇన్‌చార్జి ఎంఈవో వెంకటయ్య అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ప్రాథమికోన్నత పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మధ్యాహ్నభోజనంలో మెనూ తప్పకుండా పాటించాలని, గత మూడు నెలలగా విద్యార్థులకు గుడ్లు పెట్టకపోవడంపై అగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాలలో ప్రతి రికార్డు మెయింటెనెన్స్ చేయాలని సూచించారు. ఎఫ్ఎల్ఎన్, జాలిఫోనిక్స్ కచ్చితంగా నిర్వహించాలని అదేవిధంగా విద్యార్థుల హాజరు నమోదు ఎఫ్ఆర్ఎస్‌లో చేయాలన్నారు. అదే విధంగా మండల వ్యాప్తంగా నెలకొకసారి నిర్వహించే తల్లిదండ్రుల సమావేశం తప్పకుండా నిర్వహించాలని తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శివరాజ్, ఉపాధ్యాయులు దీప, శశిరేఖ, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న ఇన్‌చార్జి ఎంఈఓ

అసంపూర్తిగా పాలడెయిరీ కేంద్రం

నర్వ: మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌కు సమీపంలో గతంలో నిర్మాణం చేసిన పాలడెయిరీ కేంద్రం అసంపూర్తిగా శిథిలావస్థకు చేరిందని గ్రామస్తులు వాపోతున్నారు. ఈ కేంద్రాన్ని నిర్మాణం చేసి మహిళా సంఘాల ద్వారా రైతుల నుంచి పాలను సేకరించాలని నిర్మాణం చేపట్టారన్నారు. పాల ఉత్పత్తులను పెంచడంతోపాటు మహిళలకు ఆర్థికాభివృద్ధి సాధించే లక్ష్యంతో చేపట్టిన ఈ నిర్మాణం నిధులు లేమితో గత కొన్నేళ్లుగా అసంపూర్తిగా మిగిలిపోయిందన్నారు. ఈ కేంద్ర నిర్మాణ పనులకు నిధులు మంజూరు చేసి శిథిలావస్థలో ఉన్న అసంపూర్తి పనులను పూర్తిచేసి వినియోగంలోకి తేవాలని వారు కోరుతున్నారు.



నర్వలో అసంపూర్తిగా ఉన్న శిథిల పాలడెయిరీ కేంద్రం

బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలి

మహబూబ్‌నగర్ రూరల్: గండేడ్ పరిధిలోని మన్సూర్‌పల్లికి చెందిన గోవింద్ అక్టోబర్ 25న హత్యకు గురయ్యాడు. కాగా బాధిత కుటుంబానికి ప్రభుత్వం నుంచి ఆర్థికసాయం అందాల్సి ఉంది. కానీ బాధిత కుటుంబసభ్యులు అధికారులకు వినతిపత్రాలు సమర్పించినా నేటివరకు సాయం అందలేదు. దీంతో బాధితులు కేవీపీఎస్ నాయకులను ఆశ్రయించారు. దీంతో కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి ఎం.కుర్మయ్య, పరిగి బ్లాక్–2 కాంగ్రెస్ అధ్యక్షుడు కర్రె భరత్‌కుమార్, నాయకుడు మొగులయ్యలు వారికి అండగా నిలిచారు. శనివారం కలెక్టర్ జి.రవి నాయక్‌ను కలిసి గోవింద్ కుటుంబానికి ఆర్థికసాయంతో పాటు కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగ సదుపాయం కల్పించాలని విజ్ఞప్తి చేశారు.



కలెక్టర్ రవినాయక్‌కు వినతిపత్రం అందజేస్తున్న కేవీపీఎస్ నాయకులు

పాఠశాలలో తాగునీటి ఇబ్బందులు



పాఠశాలలో మరుగున పడిన కుళాయిలు



ఆవరణలో ఉన్న మిషన్ భగీరథ కుళాయి

అమరచింత: పట్టణంలోని జెడ్పీఉన్నత పాఠశాలలో విద్యార్థులకు తాగునీటి కష్టాలు మొదలయ్యాయి. పాఠశాల ఆవరణలోని మిషన్ భగీరథ ఓవర్ హెడ్ ట్యాంక్ ఉన్నా విద్యార్థులకు తాగేందుకు నీటిని అందించలేని దుస్థితి నెలకొంది. గతేడాది పాఠశాలలోని విద్యార్థులకు భోజన సమయంలో తాగునీటి ఇబ్బంది కలగకుండా జెడ్పీటీసీ నిధుల నుంచి రూ.లక్ష వెచ్చించి నిర్మించిన కుళాయిలు సైతం పనిచేయడం లేదు. దీంతో నిత్యం విద్యార్థులు భోజన సమయంలో తాగేందుకు నీరులేక ఉన్న ఒక్క కుళాయి నీటితోనే దాహం తీర్చుకుంటున్నారు. ఉన్న కుళాయి సైతం మిషన్ భగీరథ నీటి సరఫరా నిలిచినప్పుడల్లా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మధ్యాహ్న భోజన తయారీతో పాటు విద్యార్థులకు నీటిని అందించేందుకు మున్సిపాలిటీ నుంచి వాటర్ ట్యాంకర్‌ను పాఠశాలకు తెప్పించుకున్నట్లు హెచ్‌ఎం బలరాముడు తెలిపారు. అధికారులు స్పందించి తాగునీటి ఇబ్బందులను దూరం చేయాలని కోరుతున్నారు.

22న రక్త దాన శిబిరం

ఆత్మకూర్: తలసేమియా వ్యాధితో వందలాదిమంది చిన్నారులు బాధపడుతున్నారని రక్తదానం చేసి వారికి పునర్జన్మ ప్రసాదించాలని వివేకానంద సేవా సమితి జిల్లా అధ్యక్షుడు మాస్టర్ బాలు కోరారు. 22న స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి ప్రారంభమయ్యే శిబిరంలో యువకులు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు.